

ఒకటి నుంచి పవన్ పిఠాపురం పర్యటన

అంటకాగి.. పైరవీలకేగి..

- ప్రభుత్వం మారడంతో జిల్లాలో పలు శాఖల అధికారుల్లో గుబులు
- అయిదేళ్లుగా వైసీపీకి తొత్తులుగా పనిచేసిన వారిలో సస్పెన్షన్, బదిలీల కలవరం
- కాపాడాలంటూ లక్షలకు లక్షలు పట్టుకుని అధికారపార్టీ నేతల చుట్టు ప్రదక్షిణలు
- కాకినాడ కార్పొరేషన్, స్మార్ట్‌సిటీలో సగానికిపైగా కీలకస్థానాల్లో వైసీపీ సానుభూతిపరులే
- అటు బదిలీ వేటు నుంచి తప్పించుకునేందుకు ముడుపులతో పావులు
- అయిదేళ్లుగా కాకినాడ పోర్టును దర్జాగా ఏలేసిన ద్వారంపూడి సోదరుడు
- బదిలీ భయంతో రూ.10లక్షలతో సీటు కాపాడుకునేందుకు కీలకబాస్ ప్రయత్నాలు
- వైసీపీ అండతో కాకినాడ కలెక్టరేట్‌లో అయిదేళ్లపాటు చక్రం తిప్పిన సీసీ వీరేష్
- బంగ్లా ఖర్చుల పేరుతో జిల్లా అధికారుల నుంచి నెలనెలా భారీగా మామూళ్లు
- రూ.2 కోట్లతో ఇటీవల భారీ ఇళ్లు: పదేళ్లు దాటేసినా డిప్యూటేషన్‌పై పాగా
- వైసీపీ సేవలో తరించిన కుడా వీసీ బదిలీ జరగకుండా కీలక నేతల చుట్టు ప్రదక్షిణలు
- వైసీపీ నేతల భూకబ్జాలు,అక్రమాలకు సహకరించిన రెవెన్యూ అధికారుల్లోనూ కలవరం
- వాటిని తిరిగి కాపాడుతామంటూ టీడీపీ ఎమ్మెల్యేల వద్ద బేరాలు



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లాలో కొందరు కీలక అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు అడ్డగోలు పనులు, అక్రమాలతో విర్రవీగిపోయిన వీరు ఇప్పుడు కొలువు ఉంటుందో ఉండదోనని బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వం మారడంతో అయితే సస్పెన్షన్, లేదా బదిలీ వేటు ఖాయమనే భయంతో వణుకుతున్నారు. నిబంధనలతో సంబంధం లేకుండా వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా భావించి తప్పుల మీద తప్పులు చేసిన వీరంతా శంకరగిరిమాన్యాలు తప్పవేమోనని బెంగపడుతున్నారు. దీంతో ఇప్పుడు ఎలాగైనా సీటు కాపాడుకునేందుకు తెగ పైరవీలు ప్రారంభించారు. సార్.. కనికరించిండం అంటూ లక్షలకు లక్షలు పట్టుకుని కాళ్ల బేరానికి దిగుతున్నారు. కాకినాడ కార్పొరేషన్‌లో సగానికిపైగా అధికారులు వైసీపీ సానుభూతిపరులే. అయిదేళ్లుగా ద్వారంపూడి చెప్పిన ప్రతి అక్రమానికి తోలుబొమ్మలా తలూపి తీరా ఇప్పుడు బదిలీ భయంతో వణికిపోతున్నారు. ఎంత ఖర్చైనా ఇక్కడే ఉండేలా పావులు కదుపుతున్నారు.

అంతా ఇష్టారాజ్యం...

గడచిన వైసీపీ అయిదేళ్ల పాలనలో జిల్లాలో అనేక శాఖలు పూర్తిగా గాడితప్పాయి. అధికారపార్టీలో మంత్రి, ఎమ్మెల్యేలు చెప్పిందే వేదంగా వారి ప్రాపకం కోసం పలు శాఖల జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు రెచ్చిపోయారు. ప్రతిపక్ష నేతలు అభ్యంతరం, ఆందోళనలు సైతం కాదని బరితెగించేశారు. తమ వెనుక అధికార పార్టీ నేతలు ఉన్నారనే ధీమాతో చెలరేగిపోయారు. కాకినాడ కార్పొరేషన్ నిండా అక్రమాలే. గడచిన అయిదేళ్లుగా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పినట్లు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలు పనిచేశాయి. వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా పనిచేస్తూ అనేక తప్పులు చేశాయి. మడమొక్కలు నరికేసి వాటి స్థానంలో ఇళ్ల నిర్మాణానికి కోట్లలో డబ్బు అధికారులు దుర్వినియోగం చేశారు. కొమరగిరి ఇళ్లు, నగరంలో కొత్త భవనాల ప్లాన్ మంజూరులో లక్షల్లో కాసులు తినేసి సదరు నేతలు చెప్పినట్టు చేశారు. ఇప్పటికీ ఈ రెండు విభాగాల్లో అధికారులు కొందరు నేరుగా వైసీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆఫీసుకు వస్తోన్న వారి మనుషులకు కావలసిన సమాచారం, ఇతర పనులు చేసి పెడుతున్నారు. అయితే ప్రభుత్వం మారడంతో తమ పేర్లు బయటకు రావడంతో బదిలీ లేదా సస్పెన్షన్ ఖాయమని తేలడంతో ఇప్పుడు కట్టలు పట్టుకుని పైరవీలకు దిగుతున్నారు. తమను ఈసారికి కనికరించండి అంటూ టీడీపీ ఎమ్మెల్యేల వద్దకు పరుగులు తీస్తున్నారు. అటు కమిషనర్ వెంకటరావుకు సైతం బదిలీ వేటు ఖాయంగా కనిపిస్తోంది. దీంతో ఈయన కూడా ఇక్కడే ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం లక్షల టన్నుల్లో ఎగుమతి అవుతాయి. అయిదేళ్ల నుంచి ఈ పోర్టును ద్వారంపూడి సోదరుడు వీరభద్రారెడ్డి హస్తగతం చేసుకున్నారు. తానేం చెబితే అదే జరిగేలా అధికారులను గాటన కట్టేసుకున్నారు. ఏ బియ్యం ఎప్పుడు వెళ్లాలో తనే నిర్ణయించేవారు. పోర్టులో కీలక బాస్ నుంచి ఇతర అధికారులంతా అయిదేళ్లపాటు ఈయన కనుసన్నల్లో పనిచేశారు. వైసీపీకి అనుకూలంగా ఉండే ఓ రెండు కంపెనీల దొంగబియ్యం రవాణా స్కాంలో ఈ అధికారి ఇరుక్కుపోయేలా ఉన్నాడు. అటు బదిలీ వేటు ఖాయమవడంతో అధికారపార్టీ ప్రసన్నం కోసం తిరుగుతున్నారు. రూ.10 లక్షలు ఖర్చుచేసైనా సీటు కాపాడుకునేందుకు టీడీపీ ప్రజాప్రతినిధుల వద్దకు తిరుగుతున్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఏ కలెక్టర్ వచ్చినా వారికంటే సీసీ వీరేష్‌దే హవా. వైసీపీ నేతల సహకారంతో ఈయన గడచిన అయిదేళ్లుగా చెలరేగిపోయారు. జిల్లా అధికారులపై ఇష్టానుసారం పెత్తనంతో రెచ్చిపోయారు. బంగ్లాఖర్చుల పేరుతో కీలకశాఖల జిల్లా అధికారుల నుంచి తెగ కాసులు పిండేశారు. కలెక్టర్ పేరు చెప్పి ఫైళ్లు చదవడం, అధికారులకు ఫోన్లు చేసి కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారంటూ హెచ్చరించి జేబులు నింపేసుకున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా కలెక్టర్ లేరనే సమాధానం, వైసీపీ నేతలు చెప్పినట్టు తలూపి వారికి అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా సదరు ఉద్యోగి చేసి తెగ రెచ్చిపోయాడు. సీసీ హోదాలో కలెక్టరేట్‌లో ఇతర విభాగాలపై పెత్తనం చేసి సొంత పనులు చేయించుకోవడంలో ఆరితేరిపోయాడు. ఇటీవల కోట్లలో ఖరీదుచేసే ఓ విలాసవంతమైన భవంతిని నిర్మించుకున్నాడు. పౌరసరఫరాలశాఖ నుంచి డీటీ కేడర్‌లో సీసీగా డిప్యూటేషన్‌పై వచ్చిన ఈయన ఇప్పుడు ప్రభుత్వం మారడం, కొత్త కలెక్టర్ రావడంతో వణికిపోతున్నాడు. సీసీగా డిప్యూటేషన్ రద్దయితే జిల్లాపై పెత్తనం పోతుందనే భయంతో పైరవీలకు దిగుతున్నాడు. కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కుడా) వీసీ కృష్ణమూర్తి పూర్తిగా వైసీపీ వీరవిధేయుడిగా ముద్రపడ్డారు. వైసీపీ నేతలు చెప్పిందానికల్లా తలూపి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. జిల్లా వైసీపీ కార్యాలయం అనుమతులు లేకుండా నిర్మించినా అటువైపు కన్నెత్తి చూడలేదు. అంతేకాదు ఏకంగా తన కంప్యూటర్‌పై వైసీపీకి చెందిన రహస్య ఫోల్డర్లను ఇప్పటికీ ఉంచుకుని వారికి తనవంతు సహకారం అందిస్తున్నారు. అదేసమయంలో బదిలీ భయంతో టీడీపీ నేతలను కలిసి పైరవీలకు దిగుతున్నారు. ఖర్చయినా పర్వాలేదు ఇక్కడే ఉండేలా చూడండి అంటూ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆ శాఖల అధికారులకు జ్వరం...

జిల్లాలో గడచిన అయిదేళ్లలో గనులశాఖ పూర్తిగా అడ్డగోలుగా వ్యవహరించింది. వైసీపీ నేతల అక్రమాలు, అరాచకాలకు వంతపాడింది. ఏలేరు మట్టి, రామేశం మెట్ట, అక్రమ క్వారీలు తవ్వుతున్నా కళ్లుమూసుకుని వ్యవహరించింది. జగన్ సర్కారు హయాంలో గనుల సీనరేజీ వసూలు ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించగా, ఆకంపెనీ అడ్డగోలు వసూళ్లకు సహకరించింది. దీంతో డీడీ, ఏడీ, ఇతర ఇన్‌స్పెక్టర్లకు బదిలీ, సస్పెన్షన్ భయం వెన్నాడుతోంది. పంచాయతీరాజ్‌శాఖ, రెవెన్యూలో అయితే చెప్పక్కర్లేదు. రెవెన్యూలో కొందరు ఆర్డీవో, తహశీల్దార్లు కాకినాడ, ఇతర మున్సిపాల్టీల పరిధిలో వైసీపీ ఎమ్మెల్యేల భూకబ్జాలకు అడ్డగోలుగా సహకరించారు. కోట్ల విలువైన భూములు కాజేసినా చూస్తూ కూర్చున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో టీడీపీ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. కబ్జాకు గురైన భూములను తిరిగి కాపాడతామంటూ వారి వద్దకు వెళ్తున్నారు. బదిలీ లేదా సస్పెన్షన్ జరగకుండా చూడాలంటూ కట్టలతో పైరవీలు చేస్తున్నారు. అటు పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖల్లో పేదల ఇళ్ల స్థలాల చదును, నిర్మాణాలకు సంబంధించి అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారు. చదును కాంట్రాక్టులు వైసీపీ నేతలకు కట్టబెట్టి వారంతా కోట్లలో సంపాదించుకునేందుకు నేరుగా సహకరించారు. ఇప్పుడు అయా అధికారులు సైతం కొలువులకు ఎక్కడ ముప్పు ఉంటుందోనని తెలుగుదేశం నేతల చుట్టూ తిరుగుతున్నారు.



నాగమల్లితోట జంక్షన్ సమీపంలో ద్వారంపూడి ఫంక్షన్ హాలు ప్రహరీ గోడను తొలగిస్తున్న దృశ్యం

ముందే కూల్చేసుకున్నారా

- స్వచ్ఛందంగా... అక్రమ ప్రహరీ గోడ తొలగింపు
- వైసీపీ నేతల్లో వెన్నాడుతున్న కూల్చివేతల భయం
- పరువుపోతుందన్న భావనతోనే చేశారని ప్రచారం

సర్పవరం జంక్షన్, జూన్ 25: వైసీపీ అయిదేళ్ల పాలనలో కాకినాడ సిటీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి రెచ్చిపోయారు. ఎమ్మెల్యే మాత్రమే అయినప్పటికీ సీఎం జగన్‌తో ఉన్న సాన్నిహిత్యంతో అనధికారిక మంత్రిగా ఎమ్మెల్యేలు, అధికారులపై రాజ్యాంగేతర శక్తిగా పెత్తనం చెలాయించారు. అధికార గర్వంతో ఇష్టానుసారంగా నోటికి ఎంత వస్తే అంత ప్రతిపక్ష పార్టీలకు చెందిన అధ్యక్షులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ రెచ్చిపోయేవారు. ఎదురు తిరిగితే వైసీపీ మూకలతో దాడులకు ఉసిగొల్పేవారు. కాకినాడ సిటీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బంధువులు ద్వారంపూడి భాస్కరరెడ్డి ఫంక్షన్ హాల్ నాగమల్లితోట జంక్షన్ సమీపంలో ఉంది. ఫంక్షన్ హాల్ ఉత్తర భాగంలో రోడ్డు వైపు భాగంలో ప్రహరీ ఉంది. అయితే అకస్మాత్తుగా మంగళవారం ఈ ఫంక్షన్ హాల్ ప్రహరీని ద్వారంపూడి కుటుంబీకులు స్వచ్ఛందంగా తొలగింపునకు శ్రీకారంచుట్టారు. కాకినాడ 49వ డివిజన్ పైడా వారి వీధిలో అనుమతుల్లేకుండా కోట్లాది రూపాయలతో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయానికి నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు అంటించడంతో, ఎక్కడ ఈ ఫంక్షన్ హాల్ ప్రహరీని అధికారులు కూల్చివేస్తారనే భయాందోళనలతో పరువుపోతుందనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా ప్రహరీని తొలగించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రహరీ గోడ తొలగింపు సమయంలో అక్కడ ఉన్న వారిని ప్రశ్నించగా గోడ పడిపోవడంతో తొలగింపు పనులు చేస్తున్నట్టు చెప్పడం విశేషం. ఈ రహదారిలో రోడ్డు మార్గానికి చెందిన కొంతమేర స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం జరిగిన ట్టు అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ముందస్తుగానే గోడను తొలగింపు పని చేపట్టినట్టు భావిస్తున్నారు. ఏమైనా కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగడంతో వైసీపీ నేతల గుండెల్లో వణుకు ప్రారంభమైంది.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూన్25: వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ 2024కు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయశాఖ, ఉద్యానవన, ఏపీఎమ్ఐపీ, సెరికల్చర్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్లో సుమారుగా 97,543 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, ప్రత్తి, చెరుకు పంటలను సాగు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సక్రమమైన కార్యాచరణ ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ సాగుకు సన్నద్ధం కావాలన్నారు. వివిధ సొసైటీలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేస్తున్న విత్తనాల వివరాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే కౌలు కార్డులు ఉన్నవారి రైతులకు కార్డుల పునరుద్ధరణ, కొత్తకార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో రైతులు నాట్లు సకాలంలో వేసేలా వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్,పశుసంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాశరావు, హార్టికల్చర్ అధికారి మల్లిఖార్జునరావు, ఏపీఎంఐపీ, సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్ : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 25: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యనిస్తూ జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థపై సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా సకాలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి డీఆర్డీఏ, సీపీవో, మెప్మా, డీపీఎం డిజాస్టర్ మేనేజ్మెంట్, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు ఉపాధి శిక్షణ తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి శ్రీనివాసరావు, డీపీఎం రిజిస్టర్ మేనేజ్‌మెంట్ లావణ్య, డీఎల్డీవో నారాయణమూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 25: కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షాన్‌మోహన్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి భరణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలోని పరిస్థితులను ఆయనకు జిల్లా ఎస్పీ, డీఎఫ్‌వోలు వివరించారు.

విభాగాధిపతులతో సమావేశమైన కలెక్టర్

కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్‌మోహన్ మంగళవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశహాల్‌లో వివిధ విభాగాల అధికారులతో, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ల వారీగా నిర్వహిస్తున్న సిబ్బంది విధులు, ఖాళీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్, ల్యాండ్, కోఆర్డినేషన్, మెజిస్టీరియల్, లీగల్ సెల్, ఎన్నికల విభాగం తదితర సెక్షన్ సూపరింటెండెంట్‌లతో మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు ఒక బృందంగా సమష్టిగా సమన్వయం చేసుకుంటూ ఎటువంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సాయి సత్యనారాయణ, సెక్షన్ సూపరింటెండెంట్లు త్రినాథరావు, రాజు, సంధ్యారాణి, జగన్నాథం పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు






పిఠాపురంలోని టిడ్కో అపార్ట్‌మెంట్లు.. నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

- పిఠాపురంలో సగం మందికి కూడా అప్పగించలేదు
- టిడ్కోలో సాగదీతతో నష్టపోయిన లబ్ధిదారులు
- కూటమి ప్రభుత్వం రాకతో కొత్త ఆశలు

పిఠాపురం, జూన్ 25: అధికారంలోకి వస్తే ఒక్క రూపాయిలు కట్టక్కర్లేదన్నారు. తీరా గద్దెనెక్కిన తర్వాత అయిదేళ్ల పాటు లబ్ధిదారులకు అపార్ట్‌మెంట్లను అప్పగించకుండా సాగదీశారు. ఎన్నికల ముందు అప్పగించారు. అది సగం మందికే. మిగిలిన వారికి రకరకాల కారణాలతో మొండిచేయి చూపారు. పిఠాపురం పట్టణంలోని గోర్సరోడ్డులో 2014-19 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో పేద, మధ్యతరగతి ప్రజలకు టిడ్కో ద్వారా 864 అపార్ట్‌మెంట్ల ఫ్లాట్లను నిర్మించింది. టీడీపీ హయాంలోనే వీటి నిర్మాణం పూర్తయింది. దీంతో లబ్ధిదారులకు లాటరీ తీసి ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియను పూర్తిచేశారు. ఈ తరుణంలో ఎన్నికలు రావడంతో అప్పగింత నిలిచిపోయింది. ఎన్నికల సమయంలో వైసీపీ అధినేత జగన్ అపార్ట్‌మెంట్లు నిమిత్తం ఒక్క రూపాయి కట్టక్కర్లేదని, ప్రభుత్వమే వారి రుణాలు చెల్లిస్తుందని హామీలు గుప్పించారు. ఇంకేముంది తమకు ఉచితంగా అపార్ట్‌మెంట్లు వచ్చినట్టేనని వారు సంతోషించారు. అధికారంలోకి రాగానే జగన్ మడమ తిప్పేశారు. నాలుగు సంవత్సరాలపాటు అపార్ట్‌మెంట్ల సంగతిని పూర్తిగా విస్మరించారు. కనీస నిర్వహణ చేపట్టలేదు. ఎన్నికలు మరో సంవత్సరంలో వస్తాయనగా అపార్ట్‌మెంట్లు అప్పగిస్తామంటూ హడావుడి చేశారు. లబ్ధిదారులు బ్యాంకులు ద్వారా రుణాలు పొందాలని, ఇందుకువారు అర్హత పొందితేనే అపార్ట్‌మెంట్లు ఇస్తామని మెలికపెట్టారు. 864 ఫ్లాట్లకుగానూ 441 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణాలు పొందేందుకు అర్హత ఉన్నట్టుగుర్తించారు. వీరిలో 350 మందికి మాత్రమే అపార్ట్‌మెంట్లు అప్పగించారు. అందులోకి వెళ్లిన వారి కనీస సౌకర్యాలు లేక, తలుపులు, టాయిలెట్లు శిధిలమయి, వైర్లు వేలాడుతూ, తాగునీరు సక్రమంగా అందక పలు ఇబ్బందులు పడుతున్నారు. అయిదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కనీసం ఒక పని కూడా చేయలేదు. అయిదేళ్లుగా ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. పార్కు, పాఠశాల ఏర్పాటు వంటి పనులు పూర్తిగా విస్మరించారు. ఏడేళ్ల కిందట రూ.లక్ష వంతున చెల్లించి ఉన్న సుమారు 400 మంది లబ్ధిదారులకు అపార్ట్‌మెంట్లు కేటాయింపు జరగకపోవడంతో వారు అధికారులు చుట్టూ ప్రదక్షిణాలు చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారుల్లో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశలు చిగురించాయి. టిడ్కో అపార్ట్‌మెంట్లు సముదాయాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పనతోపాటు దెబ్బతిన్న వాటికి మరమ్మతులు నిర్వహిస్తారని వారంతా ఎదురుచూస్తున్నారు.

లబ్ధిదారుల్లో ఆనందం



వాలుతిమ్మాపురంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

పెద్దాపురం, జూన్ 25: ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేక వేలాదిగా పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. అలాంటివారికోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి శ్రీకారం చుట్టారు. పెద్దాపురం పట్టణ పరిధిలోని వాలుతిమ్మాపురంలో సుమారు 33 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 2019 ఎన్నికలు జరిగేనాటికి దాదాపు మొదటి, రెండవ విడత గృహాలు 70 శాతం పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఈ ఐదేళ్లు టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదు. దీంతో ఇళ్ల మధ్యలో తుప్పలు పెరిగిపోవడంతోపాటు సామాన్లు దొంగలు ఎత్తుకెళ్లారు. 2024లో కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తమ చేతికి సొంతిల్లు దక్కుతుందని ఆనందం వ్యక్తంచేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో జీప్లస్ 3 తరహాలో తొలివిడతలో 1728, రెండో విడతలో 1584 మొత్తంగా 3312 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. తొలి విడత పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అప్పట్లోనే అందజేశారు. రెండో విడత మిగిలిన 1584 ఇళ్లను వైసీపీ ప్రభుత్వం ఇవ్వకుండా లబ్ధిదారులకు చుక్కలు చూపించింది. 300, 365, 430 చదరపు అడుగుల్లో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు టీడీపీ చేపడితే వైసీపీ కనీసం పూర్తయిన ఇళ్లను కూడా ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టారు. ఇంకా పనులు పూర్తికాలేదనే సాకుతో తాత్సారం చేస్తూ వచ్చారు. దీంతో లబ్ధిదారుల్లో నిరాశ మొదలైంది. ఇప్పుడు కూటమి అధికారం చేపట్టడంతో సొంతింటికల నెరవేరుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

కాకినాడలో ఏడేళ్లుగా ఎదురుచూపులు



అసంపూర్తిగా నిలిచిపోయిన ఫేజ్-2 టిడ్కో ఇళ్లు

కాకినాడ సిటీ, జూన్ 25 : సుమారు ఏడేళ్లుగా కాకినాడలో టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుతెన్నులు చూస్తున్నారు. అప్పు చేసి లక్ష రూపాయల డీడీ కట్టిన ఎంతోమంది లబ్ధిదారులు వడ్డీలు కట్టలేక పాట్లు పడుతున్నారు. ఫేజ్-1లో నిర్మాణం పూర్తయిన 1152 ఫ్లాట్లు కేటాయించేందుకు 2018లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి లబ్ధిదారులకు ఫ్లాట్లు ఎలాట్ చేశారు. ఈ జాబితా ప్రకారం ఎలాట్‌చేసిన లబ్ధిదారులకు అప్పగించడంతో కొంత జాప్యం జరిగింది. ఈలోగా ఎన్నికలు రావడం వైసీపీ అధికారం చేపట్టడంతో మూడేళ్లపాటు టిడ్కో ఇళ్ల ఊసే లేకుండాపోయింది. ఈ పరిస్థితుల్లో తమకు ఎలాట్ చేసిన ఫ్లాట్లు అప్పగించాలని 2021లో లబ్ధిదారులు ఆందోళన చేశారు. వీరికి అండగా ప్రస్తుత సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఈ ప్రాంతానికి వచ్చి మద్దతు తెలిపారు. డెడ్‌లైన్ విధిస్తూ ఆ తేదీలోగా ప్రభుత్వం ఫ్లాట్లు అప్పగించకపోతే తామే లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తామని కొండబాబు ప్రకటించారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో కదలిక వచ్చి ఫ్లాట్ల మరమ్మతులు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకం కింద 2017లో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం కాకినాడ పర్లోపపేటలో 47 ఎకరాల పోర్టు భూమి సేకరించారు. విశాలమైన రోడ్లతో డిజైన్ వేయించి ఫేజ్-1లో 36 బ్లాక్‌లు, ఫేజ్-2లో 24 బ్లాక్‌లు నిర్మించేందుకు ఆమోదం పొందారు. ఒక్కో బ్లాక్‌లో 4 అంతస్తులు, 32 ఫ్లాట్లు చొప్పున మొత్తం 60 బ్లాకుల్లో 1920 ఫ్లాట్లు నిర్మించేందుకు పనులు చేపట్టారు. తొలి దశలో ఫేజ్-1లో 36 బ్లాక్‌లలో 1152 ఫ్లాట్ల నిర్మాణాలు పూర్తిచేసి, ఫేజ్-2లో 24 బ్లాక్‌లలో 768 ఫ్లాట్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ఫ్లాట్ల కోసం లబ్ధిదారులు 2017లో రూ.25 వేలు డీడీ, 2019లో రూ.75 వేలు డీడీ మొత్తం లక్ష చొప్పున ప్రభుత్వానికి చెల్లించారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ అనుచరులకు టిడ్కో ఫేజ్-1లో ఫ్లాట్‌లు కేటాయించాలనే ఉద్దేశంతో గతంలో ఎలాట్‌చేసిన ఫ్లాట్ల జాబితా తారుమారు చేశారు. దీంతో ఫేజ్-1 జాబితాలోని 1152 మంది లబ్ధిదారుల్లో సుమారు 400 మంది లబ్ధిదారులను ఫేజ్-2 జాబితాలోకి మార్చేశారు. మరో సుమారు 200 మందికి కొమరగిరిలో స్థలాలు ఇచ్చేలా డీడీలు తిరిగి ఇచ్చేశారు. ఇంక అక్కడి నుంచి కథ నడిపి కొత్తగా లక్ష రూపాయల డీడీలు కట్టించి ఫేజ్-1లో పూర్తయిన ఫ్లాట్‌లను కేటాయించేశారు. దీంతో ఫేజ్-1 నుంచి ఫేజ్-2లోకి మార్చేసిన లబ్ధిదారులు లబోదిబోమన్నారు. ఫేజ్-1లో ఫ్లాట్‌లు వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఇచ్చేయడంతో చేసేదీమీలేక ఫేజ్-2లో ఫ్లాట్‌లు ఎప్పుడు పూర్తవుతాయోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.



మౌలిక సదుపాయాలకు నోచుకోని టిడ్కో గృహాలు

నరకం.. చూపారు!

సామర్లకోట, జూన్25: సామర్లకోట టిడ్కో గృహాలను తమ వంతు వాటాధనం చెల్లించి అయిదేళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఇవ్వకుండా గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర ఇక్కట్లకు గురిచేసింది. గత టీడీపీ ప్రభుత్వం చివరి రోజుల్లోనే సామర్లకోట టిడ్కో గృహాలకు ప్రారంభోత్సవాలు పూర్తిచేసినప్పటికీ తదుపరి వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా రకరకాల ఇబ్బందులకు గురిచేసింది. టీడీపీ హయాంలో నిర్మించిన గృహాలుగా అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు భావిస్తూ ఈ టిడ్కో గృహాల్లో ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహించారు. సామర్లకోటలో జగ్గమ్మగారిపేటలో 416 ఫ్లాట్‌లు, ఉప్పు వారిసత్రం వద్ద 640 ఫ్లాట్‌లు ఉండగా టిడ్కో గృహాల వద్ద కనీసం వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారాయి. ఫ్లాట్‌ల చుట్టూ తుప్పలు, పొదలు పెరిగి విషసర్పాల నిలయంగా మారడంతో పలువురు ప్రాణభయంతో సంచరిస్తున్నారు. అయిదేళ్ల కిందటే డబ్బులు చెల్లించినా యాభై శాతం పైబడి లబ్ధిదారులకు నేటికీ ఫ్లాట్‌లను స్వాధీనపర్చలేదు. కాగా ఈ రెండు అపార్ట్‌మెంట్లకు సంబంధించి 377 ఫ్లాట్‌లకు చెందిన రిజిస్ట్రేషన్లు, రుణాల ప్రక్రియ పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాల్సి ఉన్నట్టు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

1వ తేదీ నుంచి పవన్ పిఠాపురం పర్యటన

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

పిఠాపురం, జూన్ 25: పిఠాపురం అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయిన తర్వాత జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తొలిసారి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన అధికారికంగా ఖరారయింది. ఈ వివరాలను జనసేన కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి పత్రికలకు తెలియజేశారు. జూలై 1వ తేదీ నుంచి పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న పవన్ అదే రోజు సాయంత్రం పిఠాపురంలో వారాహి సభ నిర్వహిస్తారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. మూడు రోజులు పాటు పిఠాపురం నియోజకవర్గంతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు. కాకినాడ జిల్లా అధికారులు, పిఠాపురం నియోజకవర్గంలోని అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తారు. పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా సమావేశం కావాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. పవన్ పర్యటన అధికారికంగా ఖరారు కావడంతో అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయింది. పవన్‌కు భారీగా స్వాగతం పలికేందుకు జనసేనతో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసైనికులు, వీరమహిళలు సన్నద్ధమవుతున్నారు.



వారాహి పూజలో పవన్‌కల్యాణ్



డీజీపీని కలిసిన పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూన్ 25: రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) గా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళగిరి రాష్ట్ర పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీకి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నానాజీని డీజీపీ ద్వారకా తిరుమలరావు అభినందించారు.



కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

అభివృద్ధిలో భాగస్వాములవుతాం

కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలిసిన జేఏసీ నేతలు

కాకినాడ సిటీ, జూన్ 25: జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులందరూ భాగస్వామ్యం అవుతామని, జిల్లా నూతన కలెక్టర్‌కు సహకరిస్తామని ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా ఛైర్మన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ అన్నారు. కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సగిలి షణ్మోహన్‌ను మంగళవారం అసోసియేషన్ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగానికి అమరావతి జేఏసీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగులందరూ నియమ నిబద్ధతతో పనిచేయాలని, అందుకు ఉద్యోగులకు తగినంత స్వేచ్ఛ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీఎస్ దుర్గాప్రసాద్, ఏపీ డ్రైవర్స్ అసో సియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్, కలెక్టరేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివ, ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ సంఘాల నాయకులు ప్రసాద్, దీపిక, రమ్య, చంద్రశేఖర్, రఘు, రామకృష్ణ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ తిండి తినేదెలా?



- మధ్యాహ్న భోజనంలో ఉడకని పులిహోర
- ముద్ద నోట్లో పెట్టుకోలేకపోయిన పిల్లలు
- చెత్తబుట్టలో పడేసిన వైనం



ఆహార పదార్థాలను పడేస్తున్న దృశ్యం

అమీనబాద్(కొత్తపల్లి), జూన్ 25:ముద్దయిపోయిన పులిహోర, అన్నం తినలేక విద్యార్థులు అసహనానికి గురై చెత్తబుట్టలో పడేశారు. అమీనాబాద్ సాలిపేట ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ప్రతీరోజూ ప్రభుత్వ పాఠశాలలకు సెంట్రల్ కిచెన్ విధానంలో మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం పాఠశాలకు పంపిణీ చేసిన అన్నం, పులిహోర చిమిడిపోయింది. ఉండలుగా ఉండటంతో విద్యార్థులు తినలేక పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన చెత్త డబ్బాలో వేశారు. పాఠశాలలో అన్నం తినకుండా పలువురు విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తరచూ పాఠశాలకు పంపిణీ చేస్తున్న మధ్యాహ్న భోజనం రుచి,శుచి నాణ్యత లేకుండా ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో ఒక మూల తెల్లవారకుండా భోజనాలు తయారు చేస్తూ అవి పాఠశాలకు వచ్చే సమయంలో పాడవుతున్నాయని వాపోయారు. ఉడికీ ఉడకని అన్నం, రుచిలేని సాంబారుతో భోజనం చేసిన తమ పిల్లలు అనారోగ్యాలకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన రుచికరమైన భోజనాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పంపా వరద గేట్లకు మరమ్మతులు

అన్నవరం, జూన్ 25: రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని పంపా వరద గేట్ల మరమ్మతులను ఇరిగేషన్ అధికారులు ఏజెన్సీ ద్వారా తాత్కాలికంగా చేపడుతున్నారు. పూర్తిస్థాయి పనులకు సుమారు రూ.30 లక్షలు అంచనా వ్యయం అవుతుందని లెక్కగట్టినా నిధుల లేమితో అత్యవసర పనులను చేపడుతున్నారు. ప్రధానంగా రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠంగా చేరితే గేట్లు ఎత్తడం, దించడం కష్టతరంగా ఉంటుండంతో గేట్లకు గ్రీజింగ్ చేపట్టి తుప్పుపట్టిన ప్రదేశంలో ముక్కలను తొలగించి కొత్తవాటితో వెల్డింగ్ ప్రక్రియ చేస్తున్నారు. అదే విధంగా పలుచోట్ల బోల్టులు లూజు కావడంతో వాటిని అమర్చుతున్నారు. నిధులు విడుదల అయితే పూర్తిస్థాయిలో పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.



మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

పలు రైళ్ల పునరుద్ధరణ

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చాగల్లు-రాజమండ్రి సెక్షన్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ ఏడాది సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 15 వరకూ తాత్కాలికంగా రద్దు చేసిన 12 రైళ్లు ఆయా తేదీల్లో యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. చాగల్లు- రాజమండ్రి సెక్షన్‌లో మరమ్మతుల నిమిత్తం 12 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వాటి తాత్కాలిక రద్దును నిలిపివేసినట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం.మండ్రూపేకర్ తెలిపారు. 07466, 07467 రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి, 17257, 17258 విజయవాడ-కాకినాడ-విజయవాడ, 17219, 17220 మచిలీపట్నం-విశాఖ-మచిలీపట్నం, 17239, 17240 గుంటూరు-విశాఖ-గుంటూరు, 22702, 22701 గుంటూరు-విశాఖ-గుంటూరు, 22708, 22707 తిరుపతి-విశాఖ-తిరుపతి రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు. అయితే నిడదవోలు-సామర్లకోట సెక్షన్ల నడుమ ఈ నెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ రద్దు చేసిన 26 రైళ్లలో జన్మభూమి, సర్కారు మాత్రమే పునరుద్ధరించారు. మిగతా రైళ్లు తాత్కాలిక రద్దు జాబితాలోనే ఉన్నాయి.

వ్యవసాయ రంగం వైపు మళ్లించేందుకు కసరత్తు

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 25: యువతను వ్యవసాయ రంగం వైపు మళ్లించేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి కసరత్తు చేస్తున్నట్టు ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ గౌతమ్ అన్నారు. స్థానిక సీటీఆర్‌ఐలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ , తమిళనాడు, పాండిచ్చేరి పరిధిలో గల కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) జోన్ 10వ వార్షిక జోనల్ సమీక్ష సమావేశాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజుల పాటు వర్క్ షాపు జరుగుతుందన్నారు. దేశంలో 731 కేవీకేలు ఉన్నాయని, వీటికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆధారం చేసుకుని వీటి ద్వారా ఎప్పటికప్పుడు నూతన పరిశోధనల, మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం, మేలైన వంగడాలు అందించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. దేశంలోని మూడు జోన్స్‌లో దాదాపు ఎనిమిది వేల హెక్టార్లలో 300 డ్రోన్స్‌ని ఉపయోగించి పురుగుల మందు జల్లడం వంటి పనులకు సంబంధించి ప్రదర్శనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.శేషుమాధవ్,షేక్ ఎన్.మీరా, సీటీఆర్‌ఐ అధికారులు పాల్గొన్నారు.



సీటీఆర్‌ఐలో విలేకరులతో మాట్లాడుతున్న గౌతమ్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



అనపర్తి, జూన్ 25: అనపర్తి మండలం కుతుకులూరులోని కూటేశ్వర కాలనీలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రామారావు, బంధువుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బంగార్రాజు(32) కూటేశ్వర కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. మంగళవారం పని జరుగుతున్న ప్రదేశంలో ఇసుక జల్లించుకునేందుకు ఏర్పాటు చేసిన యంత్రం వైరు జాయింటు వద్ద వేసిన ప్లాస్టర్ ఊడి పోయి ఉండడం గమనించని రాజు వైరుపై కాలు వేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు బంధువులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రాజు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న బంధువులు రాజు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. రాజు సోదరుడు శ్రీను పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అన్న క్యాంటీన్ పునరుద్ధరించాలని మంత్రి నారాయణకు యనమల లేఖ

తుని రూరల్, జూన్ 25: తునిలో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించాలని పురపాలక శాఖ మంత్రి నారాయణకు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు మంగళవారం లేఖ రాశారు. తునిలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ను వైసీపీ ప్రభుత్వంలో మూసివేశారని, పునరుద్ధరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అన్న క్యాంటీన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లేఖలో యనమల కోరారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలి

రంపచోడవరం, జూన్ 25: ఏజెన్సీలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ చాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ చేపట్టిన పనులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఇటీవల ఉపాధి హామీ పథకంలో మంజూరైన 75 పనులు, గుడిసె పర్యాటక కేంద్రంలో నిర్మిస్తున్న భవనాలు, జీసీసీ స్టోర్స్ భవనాల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఈ జి.డేవిడ్‌రాజ్, డీఈలు గౌతమి, చైతన్య, నాగరాజు, ఏఈలు సత్యనారాయణ, భాను, ఉమామహేశ్వరరావు, వీరభద్రరావు, ఎస్‌వో టి.మార్తమ్మ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

అయినవిల్లి, జూన్ 25: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక అన్నదాన ట్రస్టుకు రమణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత రాయుడు రమణమూర్తి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రూ.50 వేలు విరాళం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

అంతర్వేది, జూన్ 25: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పాలెపు బేబీ అన్నపూర్ణ, కుటుంబ సభ్యులు రూ.58వేలు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఐవీ కృష్ణమూర్తి, లక్ష్మణరావు రూ.40వేలు విరాళంగా ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్టు దాతలు తెలిపారు. విరాళ దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

వెంకన్న ఆదాయం రూ.1.73 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 25: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,73,610 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

'బోటు బిల్డింగ్ యార్డ్ ధారాదత్తం తగదు'

కాకినాడ సిటీ, జూన్ 25 : కాకినాడలోని బోటు బిల్డింగ్ యార్డ్ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం తగదని ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు బలసాడి రంగారావు అన్నారు. మంగళవారం ఆయన కాకినాడలోని జగన్నాథపురంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ వ్యక్తికిచ్చిన బోటు బిల్డింగ్ యార్డ్ నిర్వహణను తక్షణం రద్దు చేసి మత్స్యశాఖకు అప్పగించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రూ.6 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఏటిమొగలో గల బోటు బిల్డింగ్ యార్డ్‌ను ఆధునీకరించారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో బోటు బిల్డింగ్ యార్డ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసినట్లు చెప్పారు. దీంతో మూడు సంవత్సరాల క్రితం ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తికి బోటు బిల్డింగ్ యార్డ్ నిర్వహణను అప్పగించారన్నారు. దీంతో మత్స్యకారులు తమ బోట్లు మరమ్మతులు చేయించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బోట్ల మరమ్మతులు చేసుకోవడానికి కెనాల్ వెంబడి గట్టుపై నిలుపుకోవాల్సి వస్తుందన్నారు. తక్షణమే బోటు బిల్డింగ్ యార్డ్‌ను మత్స్యశాఖకు అప్పగించాలని రంగారావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, ధనుంజయ, బుజ్జి, దేవానందం, వాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యకార సంఘం నాయకులు



బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

గోకవరం, జూన్ 25: బైక్ అదుపు తప్పి గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన చుండ్రు రమణ(29) మంగళవారం మృతి చెందాడు. రమణ తన వ్యక్తిగత పనులు ముగించుకొని గోకవరం నుంచి స్వగ్రామమైన కామరాజుపేటకు బైక్‌పై వెళ్తుండగా గోకవరం గ్రామ శివారున అదుపు తప్పి కింద పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.



పాతవెలుగుబందలో చోరీ

రాజానగరం, జూన్ 25: మండలంలో పాతవెలుగుబంద గ్రామం జగనన్న కాలనీలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి బంగారు ఆభరణాలు, వెండి సామగ్రితో పాటు నగదును దోచుకున్నారు. కాలనీకి చెందిన బర్ల భవాని ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఇంట్లో భద్రపర్చిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతో పాటు రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్టు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

EDUCATION

» B.Sc., డిజిటల్ ఫోరెన్సిక్స్ & సైబర్ సెక్యూరిటీ / AI & ML / డేటా అనలిటిక్స్ - 3 సం.ల కోర్సులు. అర్హత : ఇంటర్ Bi.PC / MPC. UGC & కృష్ణా యూనివర్సిటీ గుర్తింపు. ఇంటర్ మార్కుల ఆధారంగా డైరెక్ట్ అడ్మిషన్. అన్ని ప్రభుత్వ ఉద్యోగార్హత. అడ్మిషన్‌కై సంప్ర. ఆంధ్రలయోల కాలేజ్, విజయవాడ. సెల్ : 77999 34688, 99125 67659

AJB -194718

4 Lines CLASSIFIED Rs.230/- Only

ప్రత్తిపాడు ఆస్పత్రిలో 15 డయేరియా కేసులు



బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

ప్రత్తిపాడు, జూన్25: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 15 డయేరియా కేసులు నమోదయ్యాయి. ప్రత్తిపాడు మండలానికి చెందిన 5 గురు కత్తిపూడి, బెండపూడిలకు చెందిన 10 మంది డయేరియాతో ఆసుపత్రిలో చేరారు. ఇప్పటికే గత రెండు రోజులుగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన డయేరియా బాధితులు మరో 15 మంది ఈ ఆసుపత్రిలో చికిత్స పొంది మంగళవారం డిశ్చార్జి అయ్యారు. దీంతో డయేరియా కేసులు ఎక్కువగా నమోదవడంతో డీఎంహెచ్‌వో నరసింహనాయక్ ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్య చర్యలు, క్లోరినేషన్, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నర్సింహనాయక్ హెచ్చరించారు. మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం,శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు.

గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై అధికారుల నిఘా

ఐదు గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

సామర్లకోట, జూన్ 25: సామర్లకోట, పెద్దాపురం మండలాల పౌర సరఫరాల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎంఎస్‌వోలు కీర్తి, విజయకుమారితో పాటు వీఆర్వోలు తులసీరాంజీ, నూతలపాటి లోవరాజు తనిఖీల్లో పాల్గొన్నారు. పలు హోటళ్లలో తనిఖీలు జరిగాయి. ఐదు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని సమీప గ్యాస్ ఏజెన్సీకి ఎంఎస్‌వో కీర్తి అప్పగించారు. ప్రభుత్వ రాయితీతో కూడిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్యావసరాలకు అక్రమంగా వినియోగించడం పౌరసరఫరాల చట్టం కింద నేరం కావడంతో 6ఏ చట్టం కింద కేసులు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఎంఎస్‌వోలు కీర్తి, విజయకుమారి చెప్పారు.



కాకినాడ

29న పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం, జూన్ 25: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29న కౌన్సిల్ సమావేశపు మందిరంలో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు.

ఉప్పలంకలో అపారిశుధ్యం తాండవం!

» ముంపులో ఉప్పలంక కాలనీ
» అంటువ్యాధులు ప్రబలే అవకాశం
» పట్టించుకోని అధికారగణం



మూడురోజులుగా ముంపులో చిక్కుకున్న ఉప్పలంక కాలనీ, నివాస గృహాల చెంత మురికి కూపం

కరప, జూన్ 25: మత్స్యకార గ్రామం ఉప్పలంకలో అపారిశుధ్యం తాండవిస్తుంది. ఆవాస ప్రాంతాలు మురికికూపంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పలంక కాలనీ ముంపుబారిన పడింది. గత 3రోజులుగా ముంపు వీడక అక్కడ నివసిస్తున్న ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం లేచింది మొదలు మోకాళ్ల లోతు నీటిలో నడుస్తూ పనులు చక్కబెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీలో అరకొరగా వేసిన సీసీ డ్రైన్ ఎవరికీ ఉపయోగపడడంలేదు. ఇళ్ల చుట్టూ రోజుల తరబడి ముంపునీరు స్తంభించిపోవడంతో గోడలు నాని గృహాలు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ముంపు, మురుగునీరు బయటకు వెళ్లే దారిలేక అంటువ్యాధులు ప్రబలే అవకాశముందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ ముంపునీటిలో దోమలు వృద్ధి చెంది రాత్రుళ్లు నిద్ర పట్టకుండా చేస్తున్నాయని, విషసర్పాల సంచారం కూడా ఎక్కువవడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇంత దారుణమైన పరిస్థితిని కాలనీవాసులు భరిస్తున్నా పాలకులు, అధికారులు గానీ కనీసం పట్టించుకోవడంలేదనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. జిల్లాలో పలుచోట్ల డయేరియా కేసులు నమోదవుతున్న తరుణంలో అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నీటి కాలుష్య కారక వ్యాధులు ప్రబలితే గ్రామంలో పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో ముంపు సమస్యను పరిష్కరించాలని, పారిశుధ్య పనులు చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముంపు సమస్యతో సతమతం:



పినపోతు జయ

ఇటీవల కురిసిన వర్షంతో కాలనీ మొత్తం ముంపునకు గురైంది. ఇళ్ల చుట్టూ మోకాళ్లలోతు నీరు చేరి ఇళ్లు దెబ్బతింటున్నాయి. ముంపు సమస్య వల్ల స్కూల్‌కి వెళ్తున్న మా పిల్లలను అమ్మ ఇంటి వద్ద వదిలిపెట్టాం. ముంపు సమస్యతో సతమతమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

విషసర్పాలు తిరుగుతున్నాయి:



మల్లాడి లోవ

కాలనీలో రోడ్లు వేయలేదు. సీసీ డ్రైన్ ఎవరికీ ఉపయోగపడడంలేదు. ముంపు వల్ల విషసర్పాలు తిరుగుతున్నాయి. దోమలు పెరిగిపోయి నిద్ర కరువైంది. నీటిలో తిరగడం వల్ల కాళ్లు ఒరిసిపోతున్నాయి. అంటువ్యాధులు వ్యాపిస్తాయని భయపడుతున్నాం. అధికారులు పట్టించుకుని ముంపు సమస్యను పరిష్కరించాలి.

'వైసీపీ భవనాన్ని ప్రజావసరాలకు వినియోగించాలి'

సర్పవరం జంక్షన్, జూన్ 25: వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున లూటీ చేసి కాకినాడలో అనధికారికంగా నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయాన్ని ప్రజావసరాల కోసం వినియోగించాలని టీడీపీ కాకినాడ రూరల్ కో కోర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) డిమాండ్ చేశారు. మంగళవారం కాకినాడ 49వ డివిజన్ పైడావారి వీధిలో 1.92 ఎకరాల్లో జీప్లస్ విధానంలో ప్రభుత్వ అనుమతుల్లేకుండా అక్రమంగా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పలివెల త్రిమూర్తులు, పార్టీ నాయకులు కొజు నెహ్రూ, దేవు వెంకన్న, ఎం.శ్రీనివాసరావు,రత్తల రవి, మండా సింహాద్రి పాల్గొన్నారు.

'హైస్కూల్ అనుమతులు రద్దు'

తాళ్లరేవు, జూన్ 25: సుంకరపాలెం శ్రీ విద్యాలయ ప్రైవేటు ఇంగ్లీషమీడియం హైస్కూల్‌కు ప్రభుత్వం అనుమతులు రద్దు చేసినట్టు ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆ పాఠశాలలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పాఠశాల నిర్వహించడానికి లీజుడీడ్ లేనందున ఆర్జేడీ ఆదేశాల మేరకు రద్దు చేసినట్టు తెలిపారు. కరస్పాండెంట్‌కు నోటీసులు జారీ చేసినా స్పందించలేదని, అందుకే పాఠశాలకు వచ్చి అనుమతిని రద్దు చేసినట్టు నోటీసు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మంగాయమ్మ, సీఆర్‌పీ కాశి శ్రీనివాస్, కరస్పాండెంట్ చోడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి'

తాళ్లరేవు, జూన్ 25: కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు మురమళ్ల టీడీపీ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. కౌలురైతులు పడుతున్న ఇబ్బందులు, వారి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన డిమాండ్లను వినతిపత్రంలో తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే బుచ్చిబాబు కౌలురైతులకు హామీ ఇచ్చారు.

'డీఎస్సీలో అవకాశం కల్పించాలి'

కాకినాడ రూరల్, జూన్ 25: రాష్ట్రప్రభుత్వం త్వరలో జారీచేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో గ్రంథాలయశాస్త్ర నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని గోదావరి లైబ్రేరియన్స్ అసోషియేషన్ కార్యదర్శి కొక్కిరమెట్ల సాయిబాబు కోరారు. సీఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ చేసి ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతకు భృతి కల్పించాలని, రాష్ట్రంలో గ్రంథాలయాల్లో ఉన్న ఖాళీలను డీఎస్సీ నోటిఫికేషన్‌తో భర్తీ చేయాలన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులకు ఉద్యోగాలు

పిఠాపురం, జూన్ 25: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు లభించాయి. కాకినాడలోని అటానమస్ కళాశాలల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 38 కంపెనీల ప్రతినిధులు విద్యార్థులకు పరీక్షలు, హెచ్ఆర్ రౌండ్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరిపారు. పిఠాపురం విద్యార్థులు 12మంది ఇందులో ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ కె.ఉషశ్రీ అభినందించారు.









'లక్ష్య సాధనకు కృషి చేయాలి'

సామర్లకోట, జూన్ 25: జిల్లాలో డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న వివిధ బీమా, స్త్రీనిధి, ఉన్నతి, ఐబీ వంటి రెగ్యులర్ పథకాల లక్ష్య సాధన పూర్తి చేసేందుకు జిల్లా సమాఖ్యలోని అందరు ఏపీడీలు, ఏపీఎంలు సంయుక్త కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి పేర్కొన్నారు. సామర్లకోట టీటీడీసీ ఆవరణలో మంగళవారం జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. పలు డ్వాక్రా పథకాలపై పీడీ సమీక్షించి లక్ష్యాలను సాధించేందుకు నిర్దేశించుకోవాలన్నారు. ఏపీడీలు బాబూరావు, అబ్దుల్, రాయ్ హాజరయ్యారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తుని రూరల్, జూన్ 25: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తుని ఎస్ఈబీ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌వో బి.చిట్టిబాబు స్పష్టం చేశారు. తుని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

జనసైనికుల ఆత్మీయ సమావేశం

గండేపల్లి, జూన్ 25: మండలంలోని మురారిలో జనసైనికులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరవ్వగా జనసైనికులు సత్కరించారు. సూరంపాలెం బాలు, బుదిరెడ్డి శ్రీనివాస్, ఉలిసి అయిరాజు, గోకేడ ప్రసాద్, మేక వీరబాబు, నల్లల శివ, దీపు, నరేష్, కుంచే కోటి పాల్గొన్నారు.

గత పాలకులు తాళ్ళూరు లిఫ్ట్‌ను వదిలేశారు

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



తాళ్ళూరు లిఫ్ట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, జూన్ 25: సుమారు 32వేల ఎకరాలకు పైగా సాగు నీరందించే తాళ్ళూరు లిఫ్ట్ ఇరిగేషన్‌ను గత పాలకులు ఐదేళ్లు కూడా నిమ్మకునీరెత్తినట్లు వదిలేశారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మండిపడ్డారు. ఆయన మంగళవారం తాళ్ళూరు లిఫ్ట్ వద్ద రైతులు, అధికారులతో సమావేశమయ్యారు. లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు వై.జగదీష్, సీహెచ్.రామక్ష్మి, గతంలో పైపులైన్లు ఏర్పాటులో భాగస్వాములైన మెగా కంపెనీ పీఎం మురళీతో ముందుగా నెహ్రూ మాట్లాడారు. పూర్తిగా పాడైపోయిన లిఫ్ట్‌ను శాశ్వతంగా తిరిగి పునరుద్ధరించేందుకు రైతులకు నీరందించే అంశాలపై అధికారులతో సమీక్షించారు. మళ్లీ సీజన్‌కు లిఫ్ట్‌ను మెరుగుపరిచి పుష్కలంగా నీటిని అందిస్తామని రైతులకు తెలియజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, మారిశెట్టి భద్రం, వెలమాటి కాశీ, సుంకవిల్లి రాజు, గురజాల వెంకన్నదొర, వెంపాటి సతీష్, బొల్లంరెడ్డి రామకృష్ణ, తాళ్ళూరు సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉపసర్పంచ్ పైణ్ణి వెంకటేశ్వరరావు ఉన్నారు.

గ్రంథాలయానికి ఫ్యాన్లు బహూకరణ

పెద్దాపురం, జూన్ 25: స్థానిక శాఖా గ్రంథాలయానికి పట్టణానికి చెందిన మహారాణీ సత్రం మాజీ చైర్మన్, పట్టణ టీడీపీ కార్యదర్శి తూతిక రాజు, ఆయన సోదరుడు నాగు రెండు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించినట్లు గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, కొమ్మన అప్పారావు, నాని, అరవింద్, రాఘవరావు, నరేంద్రకుమార్, రాజేష్ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

తాళ్లరేవు, జూన్ 25: సుంకరపాలెం బాబానగర్ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామాగ్రిని టీడీపీ నేత, మాజీ సర్పంచ్ మోపూరి శ్రీనివాసకిరణ్ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైదాడి నాగేశ్వరరావు, ఉపాధ్యాయురాలు వి.సుభలీల, టీడీపీ నేత బోయిడి వేణుగోపాల్, కోరుకొండ రవికుమార్ పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డు పరిశీలన

గండేపల్లి, జూన్ 25: రాజానగరం నుంచి కాకినాడ వెళ్లే ఏడీబీ రోడ్డు రామేశ్వరంపేట పలు చోట్ల రోడ్డు గోతులమయంగా మారిందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఏడీబీ రోడ్డును ఏఈ వర్మ పరిశీలించారు. త్వరలోనే రోడ్డు మరమ్మతులు చేపడతామన్నారు.

పిడుగు పడి ఆవు మృతి

కోటనందూరు, జూన్ 25: కోటనందూరు మండలం కెఇ చిన్నయ్యపాలెం గ్రామంలో మంగళవారం పిడుగులతో పడిన వర్షానికి బొబ్బల రాము పొలంలో ఆవు మృతిచెందింది. సుమారు రూ.90వేలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

చంద్రశేఖరస్వామి కల్యాణం

జగ్గంపేట, జూన్ 25: సర్వ కామదాసు సమేత ఉమా చంద్రశేఖరస్వామి కల్యాణాన్ని జగ్గంపేటలో మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు స్వామివారికి త్రిశూల స్నానం, పుష్పయాగం చేస్తామని అర్చకుడు కామేశ్వరశర్మ తెలిపారు.

ఎంఈవో భవిత కేంద్రం సందర్శన

ఏలేశ్వరం, జూన్ 25: పట్టణంలో భవితా కేంద్రాన్ని ఎంఈవో కె.వరలక్ష్మీ సందర్శించారు. నూతన అడ్మిషన్లు, స్కూల్ రికార్డులు, మధ్యాహ్న భోజనాలు పరిశీలించారు. విద్యార్థులకు కంప్యూటర్, అల్లికలు, కుట్లులు, డ్రాయింగ్ వివిధ అంశాలపై ట్రైనింగ్ ఇస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. ఉపాధ్యాయురాలు సీ.వాణీపద్మజ, పి.బుజ్జి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే వర్మ పరామర్శ

పిఠాపురం, జూన్ 25: పిఠాపురం మండలం గోకివాడకు చెందిన జనసైనికుడు నామా శివ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ తదితరులు ఉన్నారు.

వరి విత్తనాల పంపిణీ

తుని రూరల్, జూన్ 25: కుమ్మరి లోవలో రైతులకు వరి విత్తనాలను నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ వైస్ ప్రెసిడెంట్ జక్కన్న రామనాయుడు, పరవాడ తాతబాబు అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్టీయూ కార్యవర్గం

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 25: కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షణ్మోహన్‌ను మంగళవారం ఎస్టీయూ కార్యవర్గం కలిసింది. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీను, రాష్ట్ర కౌన్సిలర్ రాజు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, మహేష్, శ్రీకాంత్‌లు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న డ్రైవర్లు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 25: కాకినాడ ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు మంగళవారం కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. సస్పెండ్‌కు గురైన కె.వెంకటేశ్వర్లును తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, గోకవరం డిపోకు బదిలీ చేసిన కాకినాడ డిపో డ్రైవర్‌ను తిరిగి రప్పించాలని, 17 నెలలు నుంచి సస్పెండ్‌లో ఉన్న డ్రైవర్ డి.శ్రీనును విధుల్లోకి రప్పించాలని, యూటీఎఫ్ టీమ్ మిషన్ రాక చేస్తున్న అక్రమ బదిలీలు ఆపాలని, కాకినాడ నుంచి విజయవాడ డ్యూటీలకు కనీసం 8గంటలు రెస్టులు ఉండాలని, రన్నింగ్ టైమ్ పెంచి ఓటి ఇప్పించాలని, బస్సులు డ్యామేజీకి గురైతే తమ జీతాలకు కోత విధిస్తున్నారని, ప్రస్తుత డీపీటీవో, డిపో మేనేజర్ వచ్చాక 15మంది సస్పెండ్ అయ్యారని వారిని విధుల్లోకి తీసుకోవాలని, లింకు డ్యూటీలు చేసే విధానం తీసేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

కాకినాడలో టీడీపీ సేవా కార్యక్రమాలు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జూన్ 25: కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం నగరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడ జీజీహెచ్ బస్ షెల్టర్ వద్ద గెడ్డం పూర్ణ ఆధ్వర్యంలో అన్నదానం, డాక్టర్ కొండమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ, మహిళా కమిటీ ఆధ్వర్యంలో జనావళి వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ, లారీ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్, స్వీట్లు పంపిణీ, చోడిపల్లి సతీష్ ఆధ్వర్యంలో సాంబమూర్తి స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ, మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో మశీదులలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం చేపట్టారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గెడ్డం పూర్ణ పాల్గొన్నారు. నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పెద్దమార్కెట్‌లోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద పేద మహిళలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. పలు ఆలయాల్లో పూజలు చేయించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరామ్ వర్మ, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పులి పద్మకుమారి, బీజేపీ నాయకుడు వనిమిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం అన్న జనార్ధన్ క్యారేజ్ ద్వారా పేదలకు భోజనాలు పంపిణీ చేశారు.

'ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం'

పిఠాపురం, జూన్ 25: ఆపదలో ఉన్నవారికి అన్నివిధాలా అండగా ఉంటామని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. పట్టణంలోని అగ్రహారం ప్రాంతానికి చెందిన నాగేంద్ర అనే యువకుడు ప్రమాదంలో కాలు విరిగి కొంతకాలంగా మంచానికే పరిమితం అయ్యాడు. మంగళవారం అతడిని హరీష్‌తో పాటుతో వీరమహిళలు, మహిళా శక్తి గ్రూప్ సభ్యులు కోలా దుర్గా, శిరీష, మోర్త మాలతి, దారపు శిరీష పరామర్శించారు. నాగేంద్రకు రెండునెలలుకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులను హరీష్ అందజేశారు. భవిష్యత్తులోనూ అతనికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్‌కు వీరమహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, జూన్ 25: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా గణనాధుడికి విశేష పూజలు జరిగాయి. గణపతి సూక్తం, ఉపనిషత్ పారాయణం చేసి పంచామృతాలు, చెరుకురసంతో అభిషేకాలు నిర్వహించారు. గణపతి సహస్రంతో సహస్ర పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేట్లపాలెంలో ఎమ్మెల్యే రాజప్ప పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న రాజప్ప

సామర్లకోట, జూన్ 25: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో డయేరియా ప్రబలిన జొన్నలదొడ్డి తదితర ప్రాంతాల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం పర్యటించి వాస్తవ పరిస్థితిని సమీక్షించి తగు చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించారు. సోమ, మంగళవారాలలో పలవురు డయేరి యా బారిన పడి ఆసుపత్రికి చేరుతుండడంతో అధికారులు తీసుకుంటున్న చర్యలను రాజప్ప సమీక్షించారు. సోమవారం రాత్రి ఐదుగురు, మంగళవారం ముగ్గురు డయేరియాతో ఆసుపత్రిలో చేరగా వారిలో మంగళవారం సాయంత్రం నలుగురికి వైద్యం అనంతరం పూర్తిస్థాయిలో కోలుకున్నారు. మిగిలిన వారికి డాక్టర్లు పరదేశి, హిమశ్రీ, శీలక్ష్మిల నేతృత్వంలో వైద్యం అందిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలను రాజప్ప సమీక్షించారు. టీడీపీ నాయ కులు గుమ్మళ్ళ రామకృష్ణ, నున్న రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రూప, ఈవోపీఆర్డీ హరికృష్ణసత్యారెడ్డి పాల్గొన్నారు.

రాజప్పకు అభినందన సభ

సామర్లకోట వెలమపేట రామాలయం వద్ద టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు అభినందనసభ నిర్వహించారు. కార్యకర్తలు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను రాజప్ప కట్‌చేసి కార్యకర్తలు, నాయకులకు అందిం చా రు. రాజప్పను కార్యకర్తలు,నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

పెద్దాపురం: పట్టణ ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరి బాబురాజు స్వగృహంలో పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రంధి సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభకు స్వాగత ఏర్పాట్లు

ప్రత్తిపాడు, జూన్ 25: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో పదవీ ప్రమాణ స్వీకారం చేసి బుధవారం నియోజకవర్గానికి తొలిసారిగా వస్తున్న వరుపుల సత్యప్రభ రాజాకు ఘనంగా స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలో విస్తృతస్థాయి ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో టీడీపీ మండల కమిటీల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఫ్లెక్సీలు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది కూటమి కార్యకర్తలు, నాయకులు యర్రవరం చేరుకుని అక్కడ నుంచి సత్యప్రభ విజయోత్సవ ర్యాలీ ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు సీబీఎన్ఆర్మీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాళ్ళ జగదీష్ తెలిపారు.

'సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు'

పిఠాపురం రూరల్, జూన్ 25: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని పిఠాపురం ఎంపీడీవో చిన్నారావు తెలిపారు. ఆయన మండలంలోని నవఖండ్రవాడతో సహా పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. తాగునీటి శాంపిల్స్ సేకరణ, టెస్టింగ్‌ను పరిశీలించారు. మురుగుకాలువలను శుభ్రం చేయడంతో పాటు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు.

జగ్గంపేట రూరల్: జిల్లాలో డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని రామవరంలో పంచాయతీ రాజ్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది వీధులు, నీటి ట్యాంకులు, పారిశుధ్యం పరిశీలించారు.

'విద్యాప్రమాణాల పెంపునకు చర్యలు'

కరప, జూన్ 25: పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, మెరుగైన వసతులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ తెలిపారు. నడకుదురులో నేను బడికి పోతా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ర్యాలీ నిర్వహించి బడిఈడు పిల్లలను గుర్తించి వారికి జాయినింగ్ రిపోర్ట్‌లను అందజేశారు. హెచ్ఎం వాకాడ వెంకటరమణ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, నాయకులు మెండు గోవిందరాజులు, చీపురపల్లి జయేంద్రబాబు, పుష్పలత పాల్గొన్నారు.

తుని రూరల్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో గీతాదేవి అన్నారు. రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.శేషగిరి ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఎంఈ వో2 ఎ.రామకృష్ణ, పట్టణ మహిళా సమైఖ్య సభ్యులు, రీసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

'చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలి'

రౌతులపూడి, జూన్ 25: ప్రతీఒక్కరు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. రౌతులపూడిలో అంగన్ వాడీ-1 కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఎంపీపీ చిన్నారులకు సర్టిఫి కెట్లు అందజేశారు. సర్పంచ్ కటారి అర్జమ్మ, సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ జా నకి, ఎంఈవో గాడికొండబాబు, అంగన్‌వాడీలు మంగ, రాజేశ్వరి, వరలక్ష్మి ఉన్నారు.

బీజేపీ కరప మండలాధ్యక్షురాలిగా పద్మావతి

కరప, జూన్ 25: బీజేపీ మండలాధ్యక్షురాలిగా గొర్రిపూడికి చెందిన యర్రంనీడి పద్మావతి నియమితులయ్యారు. కాకినాడ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు అందినట్టు ఆమె తెలిపారు.





